క్లుప్తంగా

అధికారులకు వీడ్కోలు



అధికారులను సన్మానిస్తున్న సిబ్బంది

పాల్వంచ: పాల్వంచ మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, డీఈ మురళీ, ఏఈ రాజేశ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో సిబ్బంది వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. కమిషనర్ స్వామి గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీకి, డీఈ మురళీ ఇల్లెందు, ఏఈ రాజేశ్ నర్సంపేట మున్సిపాలిటీలకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో డీఈ స్వరూపరాణి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు, టీపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

ఇల్లెందు: కోల్‌బెల్ట్ ఏరియాలోని ఎమ్మెల్యేలు కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంపు కోసం అసెంబ్లీలో పోరాడాలని డిమాండ్ చేస్తూ ఎంఎల్ మాస్‌లైన్ అనుబంధ ఇఫ్టూ నేతలు యాకుబ్‌షావలీ, తోకల రమేష్ వినతిపత్రాలు అందజేశారు. బుధవారం అసెంబ్లీ వద్ద ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు రాజ్ టాగూర్ మక్కన్‌సింగ్, వివేక్ వెంకటస్వామి, పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రేమ్‌సాగర్‌రావు, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, బీజేపీ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, కేటీఆర్, జీవన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు అందజేశారు.

మండల సర్వసభ్య సమావేశం

సుజాతనగర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూక్యా పద్మావతి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయా శాఖలకు చెందిన అధికారులు అభివృద్ధి పనుల నివేదికలను చదివి వినిపించారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన ఎంపీడీఓ భారతిని అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, సొసైటీ చైర్మన్ మండె హనుమంతరావు, ఏఓ నర్మద తదితరులు పాల్గొన్నారు.

లైటింగ్, డెకరేషన్స్, సౌండ్స్ కార్యాలయం ప్రారంభం

పాల్వంచ: పాల్వంచ లైటింగ్, డెకరేషన్, సౌండ్స్, ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని స్థానిక అల్లూరి సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేశారు. బుధవారం ఈ కార్యాలయాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, అన్వర్, కట్ల రమేష్, అంబటి వెంకట్, నంది వీరభద్రరావు, కార్తీక్, కోట్ల ప్రభాకర్, బి.వెంకట్, గుర్రం ప్రసాద్, కత్తి శ్రీను, పి.శ్రీనివాస్‌రావు, వీరయ్య పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

ఇల్లెందు: మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు కంటి వైద్యశిబిరం నిర్వహించారు. బుధవారం ఇల్లెందు మున్సిపాల్టీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిబిరాన్ని చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. శరత్ మాక్సివిజన్ ఐ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఉద్యోగులు, కార్మికులు కంటి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుషావలీ, ఏఈ కుమారస్వామి, ఆర్ఐ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

లింగన్న ఆశయాలు సాధిద్దాం..

ఇల్లెందు: జీవితమంతా ప్రజల కోసం ధారపోసిన ఆదివాసీ నేత అజ్ఞాత దళ నాయకుడు లింగన్న అడుగు జాడల్లో పయనించాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. బుధవారం ఇల్లెందులోని మాస్‌లైన్ కార్యాలయంలో లింగన్న 5వ వర్ధంతి సభ నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుమ్మడి మాట్లాడుతూ... మల్టీనేషన్ కంపెనీలు, కార్పొరేట్ శక్తుల ప్రభావాన్ని అడ్డుకుంటూ పోడు భూములకు పట్టాలు కావాలని పోరాడిన, ఆదివాసీలను ఏకం చేసిన లింగన్నను పాలకులు అణచివేశారన్నారు. చంద్ర అరుణ, ఎన్.రాజు, ఈసం శంకర్, బుర్ర వెంకన్న, సావిత్రి, బోసు, కిరణ్ పాల్గొన్నారు.

పాల్వంచ: లింగన్న ఆశయాలను సాధించాలని పాల్వంచ, బూర్గంపాడు సబ్ డివిజన్ కార్యదర్శి జక్కుల రాంబాబు అన్నారు. బుధవారం నటరాజ్ సెంటర్‌లో లింగన్న 5వ వర్ధంతి నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ.. విప్లవోద్యమంలో అలుపెరగని పోరాటాలు నిర్వహించి పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించారని కొనియాడారు.

సీనియర్ న్యాయవాది మృతి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలోని గాజులరాజం బస్తీకి చెందిన సీనియర్ న్యాయవాది వట్టికొండ సురేష్ బాబు బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సురేష్‌బాబు మృతిపట్ల సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాతో పాటు పలువురు సంతాపం తెలిపారు.

వానాకాలం.. రైతులూ జాగ్రత్త

- పొంచి ఉన్న ప్రమాదాలు
- అప్రమత్తతే శ్రేయస్కరం



పురుగు మందు పిచికారీ చేస్తున్న అన్నదాత

ఇల్లెందురూరల్: వర్షాలు సమృద్ధిగా కురిశాయి. వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు లేచింది మొదలు అరకలతో పొలాల వైపు పరుగులు తీస్తున్నారు. వర్షాకాలంలో ఎదురయ్యే ప్రమాదాలు, పొంచి ఉన్న ముప్పులను ఒత్తిడిలో పెద్దగా పట్టించుకోరు. కొద్దిపాటి జాగ్రత్తలను పాటిస్తే ప్రమాదాల బారి నుంచి రక్షణ పొందొచ్చు.

విద్యుత్.. అత్యంత జాగ్రత్తగా ఉండాలి..

పంటలకు నీటిని అందించే క్రమంలో స్టార్టర్ల బిగింపు, మోటారు కనెక్షన్ మరమ్మతుల సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయి. మరమ్మతులు ఉంటే ఉదయం సమయాల్లోనే చేయించాలి. విద్యుత్ నేరుగా స్టార్టర్లకే సరఫరా వెళ్లేలా ఉంచొద్దు. ఫీజులను విధిగా అమర్చుకోవాలి. ఏకొద్ది తీగలు తేలినా విద్యుదాఘాతానికి గురికాకతప్పదు. తీగలు తెగి ఉంటే లైన్‌మెన్ సహాయంతో సరఫరాను నిలిపివేసి సరిచేసుకోవాలి. జంతువుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు అమరుస్తుంటారు. ఇవికూడా ఒక్కోసారి మనుషుల ప్రాణాల మీదకు తెస్తుంటాయి.

పిడుగులు.. ముందు జాగ్రత్త తప్పనిసరి..

వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన సమయాల్లో ఊహించకుండా ఒక్కోసారి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం వస్తుంది. ఇలాంటప్పుడు రైతులు తడవకుండా ఉండేందుకు చెట్ల కిందకు వెళ్తారు. ఇది సరైన పద్ధతి కాదు. ఆ సమయంలో పిడుగులు అత్యధికంగా చెట్ల మీదనే పడుతుంటాయి. పిడుగుపాటుకు గురయ్యేవారిలోనూ రైతులే ఎక్కువగా ఉంటారు. మారిన వాతావరణంతో వర్షసూచనను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకోవాలి.

పాముల విషయంలో నిర్లక్ష్యం తగదు..

వానాకాలంలో పాముల రూపంలోనూ మృత్యువు ఎదురవుతుంది. వర్షాలు కురవగానే అవి బయటకు వస్తుంటాయి. వీటి బారిన పడి అనేక మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోతుంటారు. పొలంగట్ల వెంట, చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిన చోట పాములు, విషపురుగులు చేరుతుంటాయి. కలుపు తీతతో పాటు వివిధ పనులకు వెళ్లే రైతులు వీటి బారిన పడుతుంటారు. పొలానికి వెళ్లేటప్పుడు చేతిలో కర్ర, రాత్రి వేళ టార్చిలైటు, కాళ్లకు చెప్పులు వేసుకొని వెళ్లాలి. ఒకవేళ పాముకాటు వేస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

వాగుల వద్ద ప్రమాదం..

వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు వాగులు ప్రవహిస్తుంటాయి. నీటి ఉద్ధృతిని అంచనా వేయలేని అన్నదాతలు వాగులు దాటుతూ కొట్టుకుపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పొలం పనులకు వెళ్లిన తరువాత వర్షం కురవగానే తిరుగు ప్రయాణమైన సమయంలో ఒక్కోసారి ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. వాగులు దాటే సమయంలో ఒంటరిగా కాకుండా సమూహంగా వాగు దాటాలి. ఇలా అయితే నీటి ఉద్ధృతిని తట్టుకునే వీలుంటుంది.

మందుల పిచికారీ.. ఆదమరిస్తే అంతే..

పంటల సంరక్షణకు పురుగు మందులు పిచికారీ చేయడం పరిపాటి. వీటిని పిచికారీ చేసేటప్పుడు చేతులకు గ్లౌజులు, కాళ్లకు రబ్బరు బూట్లు వేసుకోవాలి. ముక్కుకు గుడ్డ కట్టుకోవాలి. మందులను కర్రతో లేదా చేతులకు గ్లౌజులు వేసుకొని కలపడం మంచిది. గాలివాటంకు ఎదురుగా పిచికారీ చేయొద్దు. పిచికారీ చేసిన తరువాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కున్నాకే భోజనం చేయాలి. పిచికారీ సమయంలో సిగిరెట్లు, బీడీలు పీల్చకూడదు. ఇంట్లో పురుగు ముందులను పిల్లలకు అందుబాటులో ఉంచకూడదు.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

జాగ్రత్తలు పాటిస్తేనే మేలు...



విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి. అవగాహన ఉన్న వారు మాత్రమే చిన్నపాటి మరమ్మతులు చేయాలి. విద్యుత్ తీగలు తెగడం, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్యలు ఉత్పన్నం కావడం వంటి సమయాల్లో ట్రాన్స్‌కో సిబ్బందిని సంప్రదించాలి.

– కోటేశ్వరరావు, ట్రాన్స్‌కో ఏడీఈ, ఇల్లెందు

ఆందోళన చెందొద్దు..



రైతులు పొలం పనులు చేసే సమయంలో పాము కాటుకు గురైనా, ఇతరత్రా ప్రమాదాలు చోటుచేసుకుంటే ఆందోళన చెందకుండా వెంటనే ఆస్పత్రిని సంప్రదించాలి. ఆస్పత్రి దూరంగా ఉంటే అవగాహన ఉన్నవారితో మార్గమధ్యలోనే ప్రథమ చికిత్స చేసేందుకు ప్రయత్నించాలి.

– డాక్టర్ కవిత, వైద్యాధికారిణి, రొంపేడు పీహెచ్‌సీ

రిటైర్డ్ జీఎంలకు సత్కారం



జీఎంలను సన్మానిస్తున్న డైరెక్టర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సీపీపీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం సింగరేణిలోని వివిధ ఏరియాలలో వివిధ హోదాలలో విధులు నిర్వహించి ప్రస్తుతం కార్పొరేట్ పరిధిలోని సేఫ్టీ, ఎన్విరాన్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్లలో జనరల్ మేనేజర్లుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా జీఎం(సేఫ్టీ) గురవయ్య, జీఎం (ఎన్విరాన్‌మెంట్) జేవీఎల్ గణపతి, జీఎం(ట్రాన్స్‌పోర్ట్) ఎస్.జగన్మోహనరావులను డైరెక్టర్ (ఆపరేషన్స్ అండ్ పా) ఎస్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ (పీపీ) జి.వెంకటేశ్వరరెడ్డి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

జీఎంలకు అదనపు బాధ్యతలు..

జనరల్ మేనేజర్ గురవయ్య రిటైర్డ్ కాగా జీఎం(సేఫ్టీ) బాధ్యతలను సుభానీకి అప్పగించారు. జనరల్ మేనేజర్ (పర్యావరణం) జేవీఎల్ గణపతి ఉద్యోగ విరమణ చేయగా జనరల్(సేఫ్టీ) కె.సాయిబాబుకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎంవీటీసీ డీజీఎంకు..

ఎంవీటీసీ డీజీఎంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేస్తున్న బీవీఎస్ శర్మను బుధవారం సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా సన్మానించారు. ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెంరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంస్థలో బీవీఎస్ శర్మ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎంజీవీ కోటిరెడ్డి, ఏజీఎం (సివిల్) సీహెచ్ రామకృష్ణ, ఏజీఎం (ఫైనాన్స్) కె.సుమలత, డీజీఎం (ఐఈడీ) ఎన్.యోహాన్, జీకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.రమేష్, అధికారులు పాలడుగు శ్రీనివాస్, కేవీఆర్ ప్రకాష్, కరీముల్లా, వి.మధుకర్, తోట సత్యనారాయణ, ఎస్.సదానందం, ఎస్.శ్రీరామచంద్ర మురళి, మదన్‌మోహన్, బి.మాధవ్, ఎ.ఉపేందర్‌బాబు, అనిల్, బి.శంకర్, శేషశ్రీ పాల్గొన్నారు.

శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగ విరమణ పొందిన డీసీహెచ్‌ఓ అన్నామేరీని బుధవారం ఘనంగా సన్మానించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని అన్నామేరిని సన్మానించి, సేవలను కొనియాడారు.

‘9న చలో కొత్తగూడెం’

టేకులపల్లి: ఆగస్టు 9న కొత్తగూడెంలో నిర్వహించనున్న సేవాలాల్ సేన జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సేన రాష్ట్ర కోకన్వీనర్ బానోతు హుస్సేన్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండల కేంద్రంలోని బేతంపూడి సొసైటీ కార్యాలయం వద్ద సహకార సంఘం చైర్మన్ లక్కినేని సురేందర్ చేతుల మీదుగా కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం పురస్కరించుకొని సంఘం ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సేవాలాల్ సేనతో పాటు అనుబంధ సంఘాల నాయకులు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా కృష్ణయ్య

జూలూరుపాడు: కాకర్లలోని శ్రీ రుక్మిణీ సహిత సంతాన వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా చెరుకుమల్లి కృష్ణయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం చైర్మన్‌గా కొనసాగుతున్న అల్లాడి నరసింహారావు పదవీకాలం ముగియడంతో కృష్ణయ్యకు పదవి అప్పగించారు. ఈ నేపథ్యాన కృష్ణయ్య – గిరిజ దంపతులను సన్మానించారు. అల్లాడి నరసింహారావు, చెరుకుమల్లి కృష్ణయ్య, ఢిల్లీ వెంకటేశ్వర్లు, చీమలపాటి భిక్షం, పొన్నెకంటి సతీష్‌కుమార్, కూరపాటి కృష్ణయ్య, సొబ్బని కోటేశ్వరరావు, చారుగుండ్ల జగన్నాథం, ఆలయ పూజారి ఫణిరాజు పాల్గొన్నారు.

బొగ్గు టిప్పర్ బోల్తా..

టేకులపల్లి: అదుపు తప్పి బొగ్గు టిప్పర్ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం జరిగింది. కోయగూడెం ఓపెన్ కాస్టులో బొగ్గు లోడ్ చేసుకున్న టిప్పర్ కొత్తగూడెం వైపు వెళ్తోంది. ఈ క్రమంలో అతివేగం, ఓవర్‌లోడ్ కారణంగా సులానగర్–రాజుతండా మధ్యలో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి, పక్కనే లోతట్టు ప్రాంతంలో బోల్తా పడింది.

డ్రైవర్ లక్ష్మయ్యకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా టిప్పర్ ఢీకొని విద్యుత్ స్తంభం విరిగిపోయింది. టిప్పర్ ట్యాంక్ పగిలిపోవడంతో కారుతున్న డీజిల్‌ని స్థానికులు బాటిళ్లలో పట్టుకుని తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జూలూరుపాడు: పడమటనర్సాపురం శ్రీ సమ్మక్క–సారలమ్మ దేవతల గద్దెల ఎదురుగా కారు, బైక్ ఢీకొని ఇద్దరు యువకులు గాయపడ్డ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వెంగన్నపాలేనికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై పడమటనర్సాపురం వెళుతున్నారు. వనదేవతల గద్దెల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి యువకులు కిందపడ్డారు. అదే సమయంలో కొత్తగూడెం కోర్టు ఉద్యోగులు విధులు ముగించుకుని కారులో ఖమ్మం వెళుతున్నారు. ఆ కారు బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

సంత టెండర్లు రద్దు చేయండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల కేటాయింపులో రూ.5 లక్షలు దాటిన పనులకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ నిర్వహించాలనే నిబంధన ఉన్నప్పటికీ వారాంతపు సంత టెండర్ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని దానిని రద్దు చేయాలని బుధవారం అఖిలపక్ష నాయకులు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జె.బాలశౌరి, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్, సేవ్ కొత్తగూడెం మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ మాట్లాడుతూ.. టెండర్ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిర్వహించారని విమర్శించారు. అదేవిధంగా దినసరి మార్కెట్, మాంసపు వ్యర్థాల తరలింపు ప్రక్రియ కూడా టెండర్ నిర్వహించకుండా గతంలో టెండర్ నిర్వహించిన వారికే సంవత్సర కాలం పొడిగించినట్లు చెప్పారు. వీటిపై విచారణ నిర్వహించి టెండర్లు రద్దు చేయాలని, అదేవిధంగా మున్సిపాలిటీ వారు నిర్దేశించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్న కాంట్రాక్టర్‌పై వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ సాధిక్‌పాషా, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనాలి



మాట్లాడుతున్న మాధవనాయక్

సూపర్‌బజార్(కొత్తగూడెం): బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనాలని బీఎంఎస్ కార్యదర్శి పి.మాధవనాయక్ అన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఎస్‌సీఎంకేఎస్ కొత్తగూడెం ఏరియా సీఎస్‌పీలో ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి అధ్యక్షతన జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మాధవనాయక్ మాట్లాడుతూ... కొన్ని వామపక్ష సంఘాలు రాజకీయ స్వార్థంతో కార్మికులను తప్పుదోవ పట్టించే కార్యక్రమం చేస్తున్నాయని తెలిపారు. సింగరేణి సంస్థ బొగ్గు గనులు తీసుకుంటేనే సంస్థకు లాభంగా ఉంటుందన్నారు. వేలం ద్వారా బొగ్గు గనులను కేవలం నాలుగు శాతానికే పొందవచ్చని చెప్పారు. అదే వేలం లేకుండా రిజర్వేషన్ ద్వారా తీసుకుంటే 14 శాతం రాయల్టీ టాక్స్ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలని తెలిపారు. ఈ విషయాన్ని గత నెల 12న సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలతో మీటింగ్ పెట్టి అవగాహన కల్పించిందన్నారు. అయినా కొన్ని వామపక్ష కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి బొగ్గుగనులు వేలంలో కాకుండా మా గనులు మాకివ్వాలని కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ రాజకీయ స్వార్థంతో సింగరేణి సంస్థకు, కార్మికులకు నష్టం జరిగే విధంగా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మొదటి నుంచి బీఎంఎస్ సింగరేణి బొగ్గు గనులను వేలం ద్వారా తీసుకోవాలని కార్మికులను చైతన్య పరుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంతోటి నాగేశ్వరరావు, సంగెం చందర్, వీఎస్ మూర్తి, సింగారి శ్రీనివాసరావు, కుమారస్వామి, మల్లయ్య, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలను గుర్తించండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, కార్యదర్శులు

ఇల్లెందురూరల్: పల్లెల్లో వెలుగులోకి రాని నూతన ఆవిష్కరణలను గుర్తించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు ఇన్నోవేటివ్ కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పల్లెలో ఆలోచనలు ఉన్న వారు ఉంటారని, ఆర్థిక సహకారం లేక వాటికి రూపం ఇవ్వలేక నిరుత్సాహానికి గురువుతున్నారని, తమ వినూత్న ఆలోచనతో తక్కువ ఖర్చుతో రూపొందించే పరికరాలతో స్థానికంగా పనులు చేయడం కనిపిస్తుందని అలాంటి వాటిని గుర్తించి వారి చేత తమ ఆవిష్కరణల వివరాలతో దరఖాస్తు చేయించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన అంశాలపై ఎగ్జిబిషన్ నిర్వహిస్తారని వివరించారు. మారుమూల గ్రామాలలో వెలుగులోకి రాని వారిని గుర్తించి దరఖాస్తు చేయించేందుకు ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం ముద్రించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన రేంజర్లు

పాల్వంచరూరల్: అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ శాఖలో బదిలీపై వచ్చిన పలువురు రేంజర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వన్యమృగాల సంరక్షణ విభాగం పాల్వంచ డివిజన్‌లో యానంబైల్ రేంజర్‌గా ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వహిస్తున్న కవిత మాధురి బాధ్యతలు స్వీకరించకపోవడంతో రేగళ్ల రేంజర్ యశ్వంత్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు ఎఫ్‌డీఓ బాబు తెలిపారు. చాతకొండ రేంజర్‌గా టి.కనకమ్మ, ఆళ్లపల్లి రేంజర్‌గా కొయ్యూరు నుంచి బదిలీపై వచ్చిన ఎస్.కిరణ్‌కుమార్, పాల్వంచ రేంజర్‌గా కొత్తగూడెం నుంచి బదిలిపై వచ్చిన సురేష్‌లు బాధ్యతలు స్వీకరించారు. పాల్వంచ అటవీ డివిజన్ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ పద్మ కొత్తగూడెంకు బదిలీ కాగా కొత్తగూడెం డివిజన్ నుంచి పి.వి.రమణ పాల్వంచ అటవి డివిజన్ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. వైల్డ్‌లైఫ్ యానంబైల్ రేంజ్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా కిషన్, బీట్ ఆఫీసర్‌గా బట్టు రాములు విధుల్లో చేరారు.

వ్యవసాయ రంగానికి అన్యాయం



పాల్వంచ: ఆందోళన చేస్తున్న రైతులు

పాల్వంచ: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ రైతులను, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించిందని సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు ఆరోపించారు. రైతు వ్యతిరేక బడ్జెట్‌ను సవరించి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ... వ్యవసాయ రంగాన్ని కేంద్రం కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. కొనుగోలుకు చట్టబద్ధత కల్పించాలని, ఎరువుల సబ్సిడీకి కేటాయించాల్సిన పద్దుకు కోత విధించారని, కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం దేశంలో సగం మందికి పైగా ఉపాధి చూపిస్తున్న వ్యవసాయరంగానికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఉప్పుశెట్టి రాహుల్, శనగారపు శ్రీనివాస్, బానోతు రంజిత్, భూక్యా విజయ్, బాదావత్ శ్రీను పాల్గొన్నారు.

ఇల్లెందు: రైతులను, వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. బుధవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో ఇల్లెందులో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసించారు. రైతు సంఘాల నేతలు ఏపూరి బ్రహ్మం, నబీ, బుర్ర వెంకన్న, బట్టు ప్రసాద్, మోకాళ్ల రమేష్, బంధం నాగయ్య, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, ఎట్టి నర్సింహారావు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలి..



మాట్లాడుతున్న శ్రీనివాస్

సుజాతనగర్: వ్యవసాయ కార్మికులకు మూడెకరాల సాగు భూమి ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం సుజాతనగర్‌లో జరిగింది. మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. బడ్జెట్లో కార్పొరేట్‌లకు తాయిలాలు, పేద ప్రజలకు ధరల భారం, నిరుద్యోగం మిగిల్చారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు కూలీలకు రూ.12,000 పథకాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వ్యవసాయ కార్మికుల సమగ్ర సర్వే చేయాలని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన విధంగా 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల కూలి రేట్లు పెంచుతూ జీఓ తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు కనకయ్య, వీర్ల రమేష్, ముదిగొండ రాంబాబు, చిరంజీవి, వినోద, బత్తుల వెంకటేశ్వర్లు, మర్మం చంద్రయ్య, ఆలేటి కిరణ్, నిమ్మల వెంకన్న, కాత్రాల తిరుపతి, గండమాల భాస్కర్, నాగరత్నమ్మ, అబీద, పూర్ణిమ, మోకాళ్ల రమేష్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి

పాల్వంచ: తపాలా సంస్థ అందిస్తున్న ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బి.రమేష్ నాయక్ అన్నారు. బుధవారం సిల్ క్యాంపస్ పోస్టాఫీస్ పరిధిలో డీసీడీపీ కార్యక్రమం నిర్వహించారు. రమేష్ నాయక్ మాట్లాడుతూ... పోస్టాఫీస్‌లో లభిస్తున్న పీఓఎస్‌బీ ఇన్సూరెన్స్, బ్యాంక్ సేవల గురించి వివరించారు. పోటీ ప్రపంచంలో తపాలా శాఖ గ్రామ ప్రజల కోసం గ్రామీణ, చిన్నమొత్తాల పొదుపు, సేవింగ్ అకౌంట్, పీపీఎఫ్, టీడీ, ఎస్‌సీఎస్‌ఎస్, ఎంఎస్‌ఎస్‌సీ ఖాతాలు, రికరింగ్‌తో అధిక వడ్డీ అకౌంట్, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకం పొందవచ్చన్నారు. ఐపీపీబీ ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ సంవత్సరానికి రూ.520 ప్రీమియంతో రూ.10లక్షల బీమా, రూ.755తో రూ.15లక్షల బీమా ఉందన్నారు. సిల్ క్యాంపస్ ఎస్‌పీఎం బి.రమేష్, మాచర్ల రమేష్, శేషు, సత్యనారాయణ, సంజీవరావు, బాలు, శ్రీధర్, జలీల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ‘నాస్’ శిక్షణ

టేకులపల్లి: విద్యార్థుల విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలు పెంచేందుకు జాతీయ ప్రతిభా పాటవ పరీక్షలో రాణించేందుకు ఉద్దేశించిన నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) టేకులపల్లి మండలంలో రెండు రోజుల శిక్షణ శిబిరం బుధవారం సులానగర్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. ప్రతీ సంవత్సరం నవంబర్‌లో నాస్‌లో భాగంగా కేంద్రం ప్రభుత్వం దేశ వ్యాపితంగా ప్రాథమిక, ఉన్నత తరగతుల విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో జాతీయ ప్రతిభా పాటవ పరీక్షను నిర్వహిస్తుంటుంది. దీని ఆధారంగానే ఆ రాష్ట్ర విద్యా ప్రమాణాలు, విద్యార్థుల నైపుణ్యాలపై రాష్ట్ర ర్యాంక్‌ను నిర్ధారించడం జరుగుతోంది. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్ర ర్యాంక్ మెరుగు పర్చేందుకు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్ల చేత ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు 2, 3 తేదీలలో ఇల్లెందులో శిక్షణ ఇవ్వనున్నారు. నోడల్ ఆఫీసర్ అజ్మీర జగన్, టేకులపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం మేరుగు శ్రీనివాస్, సులానగర్ హెచ్‌ఎం దేవదాసు, రిసోర్స్ పర్సన్లు మంగీలాల్, వీరన్న, వెంకటరావు, సారయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆదివాసీ దినోత్సవం నిర్వహించండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఆగస్టు 9న ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీ తెగలు తాము నివసించే ప్రాంతాల్లో గ్రామగ్రామాన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు బుధవారం ఇల్లెందు పెన్షనర్ భవన్‌లో జరిగిన సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ... 1982 ఆగస్టు 9న జెనీవాలో ఐక్యరాజ్య సమితీ సమావేశంలో ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని తీర్మానించాయని తెలిపారు. 70 దేశాల్లో ఐదువేల తెగలు, 40 కోట్ల మంది 6,700 బాషలు మాట్లాడుతున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో కోయ, గోండు, నాయకపోడు, కోలం, పర్ధాన్, అందు, బిల్, తోటీ మొదలగు ఆదిమ తెగలు ఉన్నట్లు చెప్పారు. వీరంతా అడివిని నమ్ముకుని జీవిస్తున్నారని, వ్యవసాయ అటవీ ఉత్పత్తులు జిగురు, ఇప్పపువ్వు, ఇప్ప గింజలు, ముష్టి గింజలు, చిల్ల గింజలు, తునికి ఆకు, చింతపండు, తేనె సేకరించి వాటి మీద ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఉపేందర్, గుంపిడి వెంకటేశ్వర్లు, బుర్కా యాదగిరి, వట్టం కన్నయ్య, ముక్తి రాజు తదితరులు పాల్గొన్నారు.